6

# అమృతం

ఆ తరువాత కొద్దిరోజుల్లోనే భారత దేశంలో అన్ని భాషల్లోని అన్ని వార్తాపత్రికలు ఈ వార్త ప్రకటించాయి. ఆశ్చర్యంలో ఆనందంలో ప్రపంచం మునిగిపోయింది. అన్ని రకాల దేవాలయాలు కూలి పోతున్న దృశ్యాలు కనబడసాగాయి. దేవుళ్ళందరికి హార్ట్ ఎటాక్ వచ్చేసింది. భూగోళాన్ని అరచేతిలో పెట్టుకుని, తలెత్తుకుని నిలబడ్డట్టు - మనిషికి తనపై తనకు నమ్మకం పెరిగింది. ముఖ్యంగా భారతదేశానికి పట్టాభిషేకం జరిగింది. మిగతా దేశాల సామంతులతో కొలువు తీరినట్టుగా ఉంది. దేశంలోని వార్తా పత్రికలు, రేడియో కేంద్రాలు, దూరదర్శన్ కేంద్రాలు ఈ విషయాన్ని ప్రకటించాయి.

* * *

ప్రఖ్యాత భారత జీవ రసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు పరిశోధన విజయవంతం: ఆపై ప్రపంచమంతటా అమృతం పంపకం.

(ప్రత్యేక విలేఖరి)

న్యూఢిల్లీ, ఆగష్టు 15 : ప్రముఖ జీవరసాయనిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ రంగారావు మానవాళిని మృత్యువునుండి తప్పించే అమోఘమైన ఔషధం 'అమృత్-90'ని కనుగొన్నారు. దేశాన్ని వదిలి అమెరికాలో స్థిరపడ్డ డాక్టర్ రావ్, సుమారు ఇరవై యేళ్ళుగా ఈ పరిశోధన కొనసాగించారు. ఆయన రేపు ఉదయం అమృతంతో సహా భారతదేశం చేరుకుంటున్నారు. తెలుగు రాష్ట్ర రాజధానిలోని తమ స్వగృహంలో బంధుమిత్రులతో గడుపుతారు. ఈనెల 17న ఆయన

కేంద్రానికి వెళతారు. అక్కడి నుండే అన్ని రాష్ట్రాల ప్రజలకు అమృతం అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ విషయంలో పనిచేసేందుకు భారత కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ రంగారావు ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసిన విషయం పాఠకులకు తెలుసు.

—అంటూ ఇంకా రంగారావుగారి జీవిత విశేషాలు, అమృతం పనిచేయగల విధానాలు ప్రచురించారు.

ప్రజల్లో గొప్ప సంచలనం బయలుదేరింది. చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రతిచోట ప్రతిక్షణం.

"అసలే ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో ఇంక చావు రాకుండా అదెందుకూ?"

"అది తాగితే ఇక ఎప్పుడూ తిండి అక్కర్లేదు. సమస్యలుండవు. సంఘర్షణ లుండవు. అంతా క్షేమం. అంతా శాంతి. సర్వే జనా సుఖినోభవంతు...."

"అలాగా అయితే మనకు దొరుకుతుందో లేదో?".

"అందరికీ దొరుకుతుందిట!"

"అందరికీ దొరుకుతుందా?"- ఆశ్చర్యంతోపాటు వికారం....

"కేవలం మనకే దొరికితే బావుణ్ను!"- దురాశ.

* * *

స్వగృహం చేరుకున్నాడు ప్రొఫెసర్ రంగారావు. మనుమడు శ్యాంసుందర్‌తో సహా- శ్యాం సుందర్‌ను తనతోపాటే విదేశాల్లో పెంచాడు. శాస్త్రవేత్తను చేశాడు. ఈ దేశంలో ఉంచితే తన కొడుకు లాగ వ్యాపారంలోనో, రాజకీయంలోనో పడి పాడై పోతాడని ఆయన ఆనాడే భయపడ్డాడు.

స్వంత ఇంటికి చేరుకున్న కొద్దిసేపట్లోనే ప్రముఖ దేశ నాయకుల నుంచి టెలిగ్రాము లందుతూనే ఉన్నాయి విరామం లేకుండా- తన కొడుకు ఎంతో సంతోషించాడు. ఇప్పుడొస్తున్న పేరు ప్రతిష్టల్ని తర్వాత కాష్ చేసుకోవచ్చునని!

ఇప్పుడున్నది రావుగారి పాతభవనంలో కాదు. దానికి ముందు ఖాళీస్థలంలో అత్యాధునిక రీతిలో మూడంతస్తుల బంగళా తయారయ్యింది. అందులో ఏ. సి. లేని గదిలేదు. తన కొడుకు ప్రముఖ పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకున్నాడట. దేశ నాయకులందరూ, అతనికి దగ్గరి స్నేహితులే. ఇప్పుడు ప్రభుత్వాన్ని పడగొట్టడం నిలబెట్టడం అతనికి చిటికెలో పని.

నాయకులందరూ ఒక్కొక్కరే వచ్చి కలుస్తున్నారు. అమృతం ఎంత తెచ్చారని అడుగుతున్నారు. పెద్దగా నవ్వుతున్నారు. దూరంగా వున్న టేబుల్ పై జార్ చూయించగానే వెళ్లిపోవాలనుకునే వాళ్ళు సైతం అక్కడే కూచుండి పోతున్నారు. చేతులు నలుపుకుంటూ సకిలించుకుంటూ.

"గ్రాండ్‌ఫా ఇట్ ఈజ్ హైలీ ఇల్లీగల్. నాన్న చేస్తున్న వ్యాపారం అంతా అక్రమం అని తెలుస్తోంది"- అని చెప్పాడు శ్యాం వచ్చిన సాయంత్రమే. రంగారావు మనస్సు చివుక్కుమన్నది. కాని బాధపడే అవకాశమే లేదు. వచ్చేవాళ్ళు, పొయ్యేవాళ్ళు, ఫోన్లు, టెలిగ్రాములు .... విదేశీ పత్రికల రిపోర్టర్లు.... టెలివిజన్ వారి కెమెరా బృందం.

కొద్ది కొద్దిగా నీళ్ళలా చుట్టుముట్టింది జన ప్రవాహం. అమృతం తమకే కావాలంటూ కేకలు, నినాదాలు, మెమొరాండాలు. జనాన్ని అదుపులో పెట్టడానికి పోలీసు వచ్చింది. ఒకటి, రెండు, మూడు ఎన్నో పోలీసు వాన్లు.... జనం వందలు....వేలు....వేలకు వేలు.

"ఇది హిందూదేశం గనక, అమృతం కేవలం హిందువులకే ఇవ్వాలి. రామజన్మ భూమి నుండి ఈ పంపకం ప్రారంభం కావాలి."

"ఈ దేశాన్ని వేలసంవత్సరాలు ముస్లింలు పాలించారు. కనుక, ముస్లింల కివ్వడమే న్యాయం. దీనితో బాబరీ మసీదు గొడవలు చల్లబడతాయి."

"హిందూ ముస్లింల మధ్య సామరస్యం లేదు గనక, అందరితో స్నేహం పెంచుకునే మా క్రైస్తవుల కివ్వండి."

"ఒక దశాబ్దంగా పంజాబ్ మండిపోతోంది. దాన్ని ఇప్పటికైనా ఈ అమృతంతో చల్లార్చండి - దేశంలోని సిక్కులందర్నీ అమృత్‌సర్‌కు ఆహ్వానించండి."

...."లేదు, లేదు. ఎవరికీ ఇవ్వొద్దు. కూలి జనమంతా మా పెట్టుబడితో బతుకుతోంది. మేం బతికితే వాళ్లూ బతుకుతారు గనక, కేవలం మాకివ్వడం సబబు-" ధనిక వర్గం వాదన.

"బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మాకు రిజర్వేషన్లు కల్పించాలని రాసినప్పటి నుండి మాకు అన్నిట్లో ప్రత్యేక సౌకర్యాలు వున్నాయి. ఈ విషయం అందరికీ తెలుసు"- వెనకబడిన జాతులు, తెగలకు సంబంధించిన ప్రతినిధుల ప్రతివాదన.

"ఇన్ని సంవత్సరాలుగా రాష్ట్ర పరిపాలన మేమే చేస్తున్నాం గనక, ఆ విషయాలు మాకు వదిలేస్తే మంచిది. మాకు మేము లేదా మమ్మల్ని ఆశ్రయించిన వాళ్ళకూ ఇచ్చుకుంటాం" ముందున్న కులాల....ముఖ్యులు!

"జాతీయ జీవన స్రవంతిలోకి రావడానికి మాకు అభ్యంతరం లేదు. అయితే విప్లవానికి బాటలువేసే వీరుల త్యాగానికి ప్రతిఫలంగా అమృతాన్ని అండర్ గ్రౌండ్‌కు పంపించాలి. లేదా ప్రొఫెసర్ రంగారావు బాల్య స్నేహితుడైన ఎం.పార్థసారథి దూరపు బంధువు ప్రత్తిపాడు గోపాలరెడ్డి మండల పరిషత్ అధ్యక్షుణ్ని కిడ్నాప్ చేస్తాం" - ఎక్సర్‌సైజ్ నోటు బుక్కులోని గీతల కాగితంపై

పెన్సిల్‌తో రాసిన జ్వాలా బాలన్ అలియాస్ చింతమట్ల రాములు ప్రకటన....ఎలాగైతేనేం అది కూడా అక్కడికి చేరింది. పత్రికలు దాన్ని ఫోటోలు తీశాయి.

"ఇటు శ్రీలంక శాంతిసేన, అటు కాశ్మీర్ ఉగ్రవాదులు.... జార్కండ్.... సమస్యలెన్నో ఉన్నాయి. అయితే అమృతం అన్ని సమస్యల్ని సరిచేస్తుంది." వ్యక్తులు, సంస్థలు, పార్టీలు, కరపత్రాలు, పత్రికలు వగైరా వగైరా....ఏక కంఠంతో ఘోషిస్తున్నట్టయ్యింది.

"దీన్ని అమృతాస్యతా సంవత్సరంగా ప్రకటించాలి" - మరో సూచన.

జనాన్ని అదుపులో పెట్టడానికి పోలీసులు లాఠీఛార్జి చేశారు. బాష్పవాయువు వదిలారు. విడిపోతున్నట్టు పోతూనే మళ్లీ కమ్ము కుంటున్న కారుమేఘాల్లా జనం, గుమిగూడుతూనే ఉన్నారు. అల్లరిలో, సంఘర్షణలో, స్వార్థంలో, సంకుచితత్వంలో జనం! జనం!! భవనంచుట్టూ - అమృతం కోసం. వరదలో కొట్టుకొచ్చిన వాళ్ళ లాగా, దారి తప్పిపోయిన వాళ్ళలాగా.

ప్రొఫెసర్ రంగారావు దెబ్బతిన్నాడు. తన ఆశయాలేమిటి? ఇప్పుడు చూస్తున్నదేమిటి? తన బంగారు మాతృదేశంలో జరుగు తున్నదేమిటి? అవి కలలు.... కల్లలు, నిశ్శబ్దంలో ఊహలు-ఇదంతా నిజం! పేలిపోతూ, ఘర్షణ పడుతూ, బయట జరుగుతున్న దాని కన్నా కొన్ని రెట్లధికంగా రంగారావులో మానసిక ఆందోళన, సంచలనం, సంక్షోభం, భ్రమ పగిలిన చప్పుడు - రెప్పలు చీలిన చప్పుడు భయం. భయం. గుండెనొప్పి, ఆయాసం-

శ్యాంసుందర్ గాబరా పడ్డాడు. అతడి తండ్రి కూడా.

నాయకులందరూ మంచం చుట్టూ మూగారు.

పెద్ద పెద్ద హాస్పిటల్స్ అన్నీ చకచకా దిగొచ్చి చుట్టూ చేరాయి. ఉదయానికి కొంత కోలుకున్నాడు ప్రొఫెసర్. బయట

మాత్రం మార్పులేదు. అలాగే ఉంది. దానికితోడు మరో వ్యక్తి వివాదం కూడా వినిపించింది. మతం ఏదైతేనేం? అమృతం ఎవరికి పంచబడుతుందో అదే మా మతం అనేవాళ్ళ గుంపు మరోవైపు చాటుగా మాటేసుకుని కూర్చుంది.

విషయం నిముషాల మీద కేంద్రానికి తెలిసింది. సిఆర్‌పి ఏ క్షణంలోనైనా రావచ్చు. అంతదాకా పరిస్థితి అదుపులో పెట్టాలి. కార్టూన్ బొమ్మల్లా అందరికీ నమస్కారాలు చేస్తూ, శాంతి శాంతి అని అరుస్తున్నారు నాయకులు. ''మా తండ్రిగారితో చెప్పి, అందరికీ అంటే అన్ని వర్గాల వారికీ అమృతం సమానంగా ఇప్పించే యత్నం చేస్తా"నని హామీ ఇస్తున్నాడు - ప్రజా నాయకులతో చేతులు కలిపిన వ్యాపారవేత్త, రంగారావు గారి కుమారుడు.

ప్రజల్లో ఎంతో అలజడి కలిగించే పదార్థం తయారు చేశాడు. శాంతిభద్రతలకు భంగం కలిగించాడు. సామాన్య జనజీవితాన్ని అతలా కుతలం చేశాడు కనుక, 'అమృతాన్ని' వశపర్చుకుని - ప్రొఫెసర్ రంగారావును మీసాకింద కస్టెడీలోకి తీసుకోవాలనుకుంటు న్నట్లు మరోవార్త తాజాగా మురికివాసనలా గుప్పున వ్యాపించింది.

అదే నిజమయితే, జార్‌ను 'రిప్లేస్' చేసి అమృతం వున్న అసలు జాడీని ఇంట్లోనే వుంచేస్తే, తన సంతతికి కాగా మిగిలింది బ్లాకులో విదేశాలకు గప్‌చిప్‌గా అమ్ముకోవచ్చు. స్విస్ బాంక్‌లో ఖాతాలున్న వాళ్ళందరినీ క్యూలో నిలబెట్టొచ్చు. ప్రపంచంలోనే ధన వంతుల్లో నెంబర్‌వన్ అయిపోవచ్చు. ఆలోచన మెరిసింది రంగారావు గారి కొడుక్కు. తండ్రిని విడిపించుకోవడం పెద్ద సమస్యగా అనిపించ లేదాయనకి.

''అధికారంలో వున్న పార్టీ మిమ్మల్ని గుర్తించడం లేదు. మాకు న్యాయం కలగజేయాలంటే మా పార్టీ వాళ్ళకే అమృతం పంచాలి."

"కాదు! మా పార్టీకే- ఒకవేళ మర్యాదగా ఇవ్వకపోతే సాయుధ పోరాటం జరుపుతాం. సూర్యుడు అస్తమించనట్టే వీరుడు కూడా మరణించడు"- మరో పార్టీ బెదిరించింది.

బయట కేకలుగా గొంతులు చించుకుంటున్న రాజకీయాలని భరించలేకపోయ్యాడు ప్రొఫెసర్ రంగారావు. తన దేశ ప్రజలు.... ఆహా, తన దేశం?.... ఇందుకోసమేనా జీవితాంతం శ్రమించింది? మేధస్సునంతా ధారపోసింది? అజ్ఞానుల ఓట్లతో విజ్ఞానుల నెత్తికెక్కిన రాజకీయాలు....

"శ్యాం''- అని గట్టిగా పిలిచాడు.

రెండునిమిషాలైపోయినా అతడు రావేదు.

రంగారావు గారిలో సహనం పదునెక్కింది. కృషిలో, త్యాగంలో, శోధనలో పండిపోయిన రంగారావుగారి రక్తం, అంతటి వృద్ధాప్యంలో సైతం ఒక్కసారి తలెత్తింది. ఉక్రోషంతో వెళ్ళి జాడీని బాల్కనీలోకి దొర్లించాడు.

''ఓ కమాన్ గ్రాండ్ పా .... స్టాప్ ఇట్ .... అంటూ శ్యాం పరుగెత్తుకొచ్చాడు. రంగారావు గారు ఆగలేదు. ఆగదల్చుకోలేదు గనక ఆగలేదు. అమాంతం మూడో అంతస్తు నుండి అమృత భాండాన్ని కింద కాంపౌండ్‌లోకి నెట్టేశాడు.

జాడీ పగిలిన శబ్దం. బయటి శబ్దాన్ని ఆపింది.

అంతా నిశ్శబ్దం- జీవం చచ్చిన చప్పుడు. కాంపౌండ్‌లోని, ఆల్షేషన్ డాగ్ అదేమిటో అని వాసన గ్రహించి ముందుకురికింది.

మళ్ళీ అలజడి. కాంపౌండు దాటి రావడానికి, మూసేసివున్న గేటుదూకి రావడానికి జనంలో ఉధృతమైన తహతహ.

కిందికి చూశాడు ప్రొఫెసర్. అప్పటి నుండి వంగి దండాలు పెడుతూ శాంతిని గురించి ప్రబోధించే తెల్లటోపీలన్నీ భూమిని కరుచు

కున్నాయి- జాడీ పగిలినచోట కాట్లాడుకుంటున్నాయి. కుమ్ము కుంటున్నాయి.

—అందులో టోపీ లేకుండా ఒకే ఒక్క తల ఉంది. అది ఎవరిదో కాదు. తన కొడుకుదే. పక్కకు చూశాడు. మనుమడు శ్యాంసుందర్ ముఖం సూర్యుడిలా మండిపోతోంది. తన తండ్రి చేస్తున్న జుగుప్సాకరమైన పనికి ఆవేశంతో వూగిపోతున్నాడు.

"ఫరవాలేదు. మట్టిలోకలిశాక, అమృతం పనిచేయదు-చిన్నగా శ్యాంసుందర్ వీపుతట్టి మెల్లగా లోనికి కదిలాడు ప్రొఫెసర్ రంగా రావు. అతనిలో పశ్చాత్తాపం సుళ్ళుతిరుగుతోంది. ఈ దేశానికి, ఈ ప్రపంచానికి ఆకలిని జయించే అమృతం కాదు. స్వార్థాన్ని జయించే మానవత్వం కావాలి. మానవత్వానికి ఫార్ములా ఏమిటి? అది సాధించడం ఎలా? ఇన్నేళ్ళుగా కష్టపడి కృంగికృశించి కనుక్కొన్న అమృతం ఫార్ములా వృధాయేనా? నోబెల్ కమిటీవారికి ఏం రాయడం? సమస్య సమస్యగానే ఉండిపోయింది.

"రంగారావ్ డౌన్ డౌన్."

"అమృతం నాశనం చేశాడు. దేశద్రోహిని అరెస్టు చేయండి."

"దేదో దేదో- ఫార్ములా దేదో"- కాంపౌండ్ బయట జనం.... జనం.

ఇలాంటి వాళ్ళున్నాక 'దేశమాత' ఎక్కడుంటుంది? ఎప్పుడో చచ్చిపోయింది. కేవలం ఇప్పుడున్నది శవం మాత్రమే. కిందికి చూశాడు శ్యాంసుందర్. శవాన్ని పీక్కుతింటున్నట్లు మట్టి గతుకుతూ వాళ్ళు-

కాంపౌండ్‌లోపల వాళ్ళు కొద్దిమందే!! ○

ఆదివార ఆంధ్ర జ్యోతి
2 డిసెంబర్ 1990